కాంతితో పనిచేసే కంప్యూటర్ చిప్!

హ్యాక్ కాదని చెప్తున్న శాస్త్రవేత్తలు



వాషింగ్టన్, ఫిబ్రవరి 16: విద్యుత్తు బదులుగా కాంతితో పనిచేసే కొత్త కంప్యూటర్ చిప్‌ను పెన్సిల్వేనియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీని ద్వారా కృత్రిమ మేధ పద్ధతులను అభివృద్ధి చేసి డాటా బదిలీ వేగవంతంగా, మరింత సామర్థ్యంతో చేయొచ్చని వారు చెప్తున్నారు. సిలికాన్-ఫొటోనిక్(సిఫ్) చిప్‌గా పిలిచే ఈ సరికొత్త చిప్ కాంతిని ఉపయోగించుకొని లెక్కలను వేగంగా నిర్వహిస్తుంది. బహుళ సంఖ్యలను ఒకేసారి గుణకారం చేసేందుకు వీలుగా, హ్యాక్ చేయలేని విధంగా ఈ చిప్‌ను రూపొందించారు. ఈ చిప్‌లు గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థానాన్ని భర్తీ చేయవచ్చని అసోసియేట్ ప్రొఫెసర్ ఫిరూజ్ తెలిపారు. కాంతితో పనిచేసే ఈ చిప్‌ల వల్ల డాటా భద్రంగా ఉంటుందని సైంటిస్టులు చెప్తున్నారు. ఈ పరిశోధన వివరాలు నేచర్ ఫొటోనిక్స్‌లో ప్రచురితమయ్యాయి.

నాన్ వెజ్ రైస్!

సియోల్, ఫిబ్రవరి 16: ఆహారం ద్వారా అధిక ప్రోటీన్లు పొందాలనుకొనేవారికి శుభవార్త. దక్షిణ కొరియాలోని యోన్సీ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కొత్త రకం హైబ్రీడ్ నాన్‌వెజ్ రైస్ (మాంసం బియ్యం)ని సృష్టించారు. ఈ బియ్యంలో పశు మాంసం, కొవ్వు కణాలుండేలా ప్రయోగశాలలో సాగు చేస్తారు. ఇందుకోసం ముందుగా బియ్యానికి చేపల నుంచి తీసిన జిగురు లాంటి పదార్థాన్ని పూస్తారు. దీనివల్ల పశు మాంస కణాలు దానికి అతుక్కుపోతాయి. తర్వాత వాటిని 11 రోజుల పాటు ఒక పాత్రలో సాగు చేస్తారు. సాధారణ బియ్యం కంటే 8 శాతం ప్రొటీన్లు, 7 శాతం కొవ్వు ఎక్కువగా ఉంటాయి. ఇవి అందుబాటులో ధరలో, పర్యావరణ హితంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మేటర్ జర్నల్ కథనం ప్రకారం కరువు, సైనిక రేషన్, అంతరిక్ష ఆహారంగా ఈ నాన్‌వెజ్ రైస్‌ని వాడుకోవచ్చు. ప్రయోగశాలలో తయారయ్యే ఈ బియ్యం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గుతాయని, మాంసం కోసం పశువుల్ని పెంచే అవసరం తప్పుతుందని సైంటిస్టులు చెప్తున్నారు. ఈ రకంగా ఇవి పర్యావరణ హితమైనవని విశ్లేషిస్తున్నారు. అయితే ఈ బియ్యాన్ని ప్రజలు ఏ మేరకు ఆదరిస్తారనేది పెద్ద ప్రశ్నగా మారింది.

టెక్స్ట్ ఇస్తే వీడియో రెడీ

న్యూయార్క్, ఫిబ్రవరి 16: టెక్నాలజీ రంగంలో ఏఐ చాట్ జీపీటీ హాట్‌టాపిక్‌గా మారింది. ఈ చాట్ జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐ ఇప్పుడు మరో సంచలనంతో ముందుకొచ్చింది. మనం టెక్స్ట్ ఇస్తే చాలు నిమిషం వీడియోను రూపొందించే కొత్త మాడల్‌ను రూపొందించింది. దీనికి సోరా అని పేరు పెట్టింది. వినియోగదారుడు ఇచ్చిన ప్రాంప్ట్‌కు అనుగుణంగా ఈ మాడల్ నిమిషం వీడియోను రూపొందించి ఇవ్వగలదని ఆ సంస్థ ఎక్స్‌లో వెల్లడించింది. యూజర్ ఇచ్చిన పదాలను అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా కెమెరా మోషన్ల తోసహా వివిధ క్యారెక్టర్లను కూడా ఇది రూపొందిస్తుందని తెలిపింది. దీని భద్రత కోసం అనేక చర్యలను తీసుకొంటున్నామని ఓపెన్ ఏఐ తెలిపింది. ఈ సాంకేతికతలో తప్పు దోవ పట్టించే కంటెంట్‌ను గుర్తించే టూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపింది. సోరా రూపొందించిన పలు వీడియోలను ఓపెన్ ఏఐ ఎక్స్‌లో షేర్ చేయగా, నెటిజన్ల నుంచి మంచి స్పందన లభిస్తున్నది.

కనిష్ఠ స్థాయికి గ్రీన్‌కార్డుల ఆమోదం రేటు

వాషింగ్టన్: అమెరికా చరిత్రలో రికార్డులో స్థాయిలో గ్రీన్‌కార్డుల ఆమోదం రేటు కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో కేవలం 3 శాతం దరఖాస్తులు మాత్రమే ఆమోదం పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది సుమారు 3.7 కోట్ల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రాక్టికల్‌గా చూస్తే 97 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్టు తెలుస్తున్నది. ఏటా గ్రీన్ కార్డుల కోసం డిమాండ్ పెరుగుతున్నప్పటికీ కార్డుల జారీ సంఖ్య స్థిరంగా ఉంటున్నది. గ్రీన్ కార్డుల జారీలో లాటరీ విధానం పాటిస్తుండటం వల్ల అదృష్టం కొందరి తలుపు మాత్రమే తడుతున్నది. గ్రీన్‌కార్డుల్లో క్యాప్‌డ్, అన్ క్యాప్‌డ్ క్యాటగిరీలు ఉండటం వల్ల దరఖాస్తుదారుల జీవిత భాగస్వాములు, మైనర్లైన పిల్లలు, తోబుట్టువులు వాటిని పొందడం కష్టమవుతున్నది. ఈ పరిణామం అమెరికాలో స్థిరపడాలనుకుంటున్న భారతీయ ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతున్నది. అందుబాటులో ఉన్న అన్ని గ్రీన్‌కార్డులను జారీ చేయడంలో అమెరికా ప్రభుత్వం తరచూ విఫలం కావడమే ఇందుకు కారణం.

అసెంబ్లీలో కేజ్రీవాల్ విశ్వాస తీర్మానం

ఈడీ సమన్ల నేపథ్యంలో బలనిరూపణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అసెంబ్లీలో శుక్రవారం విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇద్దరు ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చారు. ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఇస్తామని, బీజేపీతో చేతులు కలుపాలని కమలం పార్టీ నేతలు ఆఫర్ ఇచ్చినట్టు నాతో చెప్పారు. అంతే గాక.. త్వరలో కేజ్రీవాల్ అరెస్టు అవుతారని, ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ నేతలు చెప్పినట్టు తెలిపారు. అందుకే నేను మొదటి నుంచి చెప్తున్నాను. మద్యం పాలసీ కేసు ఓ తప్పుడు కేసు. మా ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తున్నది' అని పేర్కొన్నారు. అయితే విశ్వాస పరీక్షపై శనివారం చర్చ జరుగనుంది. ఇదే రోజు తన ముందు హాజరుకావాలని ఢిల్లీ కోర్టు కేజ్రీవాల్‌ను ఆదేశించింది. మద్యం పాలసీ కేసులో ఈడీ సమన్లకు స్పందించనందుకే ఈ ఆదేశాలు జారీ చేసింది.

నితీశ్‌కు తలుపులు తెరిచే ఉంటాయ్

పాట్నా, ఫిబ్రవరి 16: బీహార్ సీఎం నితీశ్‌కుమార్ బీజేపీతో పొత్తు తెంచుకొని వెనక్కి రావాలని ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ సూచించారు. నితీశ్‌తో కలిసి పనిచేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని చెప్పారు. ఆర్జేడీ రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా లాలూ విలేకరులతో మాట్లాడుతూ 'నితీశ్ రాక కోసం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై నితీశ్ పార్టీ జేడీయూ అధికార ప్రతినిధి నీరజ్‌కుమార్ స్పందిస్తూ మళ్లీ వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని తెలిపారు.

గుజరాత్ హైకోర్టులో కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

అహ్మదాబాద్: ప్రధాని మోదీ విద్యార్హతలపై వ్యాఖ్యలకు సంబంధించి గుజరాత్ వర్సిటీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ట్రయల్ కోర్టు జారీ చేసిన సమన్లను రద్దు చేయాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ చేసిన అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించింది. ట్రయల్ కోర్టులోనే వాదనలను వినిపించాలని పిటిషనర్లకు చెప్పింది. మోదీ విద్యార్హతలకు సంబంధించిన డ్రువపత్రాలను దరఖాస్తుదారులకు ఇవ్వాలని సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు గత ఏడాది మార్చిలో రద్దు చేసింది. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ ఈ నేతలిద్దరిపైనా పరువు నష్టం కేసు వేశారు. వర్సిటీని లక్ష్యంగా చేసుకుని వీరిద్దరూ కించపరిచే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

పుతిన్ ప్రత్యర్థి నావల్నీ మృతి

జైలులో అనుమానాస్పద స్థితిలో రష్యా ప్రతిపక్ష నేత మరణం

అధ్యక్ష ఎన్నికల వేళ కీలక పరిణామం • ముమ్మాటికీ హత్యేనన్న ప్రతిపక్షాలు

పుతిన్‌పై వివిధ దేశాధినేతల విమర్శలు • పుతిన్‌కు వ్యతిరేకంగా నావల్నీ గళం

ప్రభుత్వ అవినీతిపై అలుపెరుగని పోరు • గతంలోనూ ఆయనపై విషప్రయోగం

మాస్కో, ఫిబ్రవరి 16: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బద్ధ విరోధి, ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీ శుక్రవారం అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. రష్యాలో అధికారుల అవినీతిపై ఉద్యమించిన 47 ఏండ్ల నావల్నీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఆందోళనలు నిర్వహించారు. తీవ్రవాదిగా ముద్రపడి 19 ఏండ్ల జైలుశిక్షకు గురైన నావల్నీ ఉదయం వాహ్యాళికి వెళ్లి కిందపడిపోయాడని, వెంటనే కోమాలోకి వెళ్లిపోయాడని జైలు అధికారులు చెప్పారు. అంబులెన్స్‌లో అతడిని వెంటనే దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఇంతకుముందు కూడా నావల్నీపై విషప్రయోగం జరుగగా, జర్మనీ వెళ్లి చికిత్స తీసుకున్నారు. జర్మనీ నుంచి తిరిగి వచ్చిన వెంటనే 2021లో అతడిని అరెస్టుచేసి జైలుకు పంపారు.రష్యాలో రాజకీయ ప్రత్యర్థులు తమ అంతర్గత గొడవల్లో కనుమరుగు కావడమో లేదా జైలు పాలు కావడమో లేదా ప్రవాసం వెళ్లిపోవడమో లేదా ఇలా మృత్యువాత పడటం సర్వసాధారణమేనని ఆ దేశపు వార్తా సంస్థలు పేర్కొంటున్నాయి.

భార్య, పిల్లలతో రష్యా ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీ (ఫైల్)

పుతిన్ చేయించిన హత్య!

అసలు నావల్నీ మరణించినట్టు తమకు అధికారికంగా సమాచారం లేదన్న నావల్నీ సహచరులు.. ఆయన నిజంగా చనిపోయినట్లయితే 24 గంటల్లో మృతుడి బంధువులకు ఎందుకు తెలియచేయలేదని ప్రశ్నించారు. నావల్నీపై పుతిన్ గతంలోనే చాలా రకాలుగా హింసించాడని పేర్కొంటూ నావల్నీ అకాల మరణానికి పుతినే బాధ్యత వహించాలని రష్యాకు చెందిన వ్యాపారవేత్త మిఖాయిల్ ఖోడోర్కోవ్స్కీ అన్నారు. నావల్నీ మృతి నిజమైతే ఇది కచ్చితంగా పుతిన్ చేయించిన హత్యేనని ప్రతిపక్ష నాయకుడు డిమిత్రి గుడ్కోవ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. పుతిన్, అతని మాఫియా గుట్టు బయటపెట్టినందుకే నావల్నీ చంపారని విదేశాల్లో నివసిస్తున్న చెస్ క్రీడాకారుడు కాస్పరోవ్ పేర్కొన్నారు.

'పదవి కోసం ఎంతకైనా తెగిస్తాడు'

నావల్నీ అనుమానాస్పద మృతిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ పుతిన్ చేయించిన హత్య అని ఆరోపించారు. పుతిన్ తన పదవి కోసం దేనికైనా తెగిస్తాడని విమర్శించారు. జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ స్పందిస్తూ నావల్నీ మరణం పుతిన్ పాలన ఎలాంటిదో స్పష్టం చేస్తున్నదని అన్నారు. నావల్నీని క్రెమ్లిన్ దారుణంగా హత్య చేసిందని లాట్వియన్ ప్రెసిడెంట్ ఎగ్గార్స్ రింకెవిక్స్ ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. వైట్ హౌస్ జాతీయ భద్రతా సలహాదారుడు జేక్ సుల్లివన్ మాట్లాడుతూ నావల్నీ మరణం ధృవీకరణతే .. ఇదొక భయంకరమైన విషాదంగా నిలిచిపోతుందన్నారు.

ఎవరీ నావల్నీ?

నావల్నీ న్యాయవాది వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. బ్లాగ్ ద్వారా ప్రభుత్వ ఉన్నతాధికారుల అవినీతిని బయటపెట్టారు. 2018లో పుతిన్‌కు వ్యతిరేకంగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆయనపై అనర్హత వేటు వేయడం ద్వారా అడ్డుకున్నారు. తనపై జరిగిన విష ప్రయోగానికి చికిత్స కోసం 2021లో జర్మనీ వెళ్లారు. చికిత్స తర్వాత రష్యాకు తిరిగి రాగా, ఎయిర్‌పోర్టులోనే అరెస్ట్ చేశారు. నిధుల దుర్వినియోగం సహా వివిధ కేసుల్లో ఆయనకు 19 ఏండ్ల జైలు శిక్ష పడింది. ఆయన జీవితాన్ని ఆధారంగా చేసుకుని కెనడా దర్శకుడు రోహెర్.. నావల్నీ పేరుతో ఓ డాక్యుమెంటరీ తీశారు.

అనుమానాస్పద రీతిలో ప్రత్యర్థుల మరణాలు

రష్యా కిరాయి సైన్యం వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌జెనీ ప్రిగోజిన్ గతేడాది ఆగస్ట్‌లో విమాన ప్రమాదంలో చనిపోయారు. 2022లో భారత్‌లోని రాయగడలోని ఒక హోటల్లో రష్యా ఎంపీ పావెల్ ఆంటోవ్ అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. 2022లో 22 మంది రష్యన్ ప్రముఖులు చనిపోయారు. వీరిలో కొందరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే వీరందరి మరణాలకు పుతిన్ కారణమని కొన్ని మీడియా సంస్థలు అనుమానం వ్యక్తం చేశాయి. తనను విమర్శించే, ఎదిరించేవారిని పథకం ప్రకారం నామరూపాల్లేకుండా చేస్తాడని పుతిన్‌పై బలమైన ఆరోపణలున్నాయి.

భారతీయులపై దాడుల నిరోధానికి గట్టి చర్యలు: అమెరికా

వాషింగ్టన్: భారతీయ విద్యార్థులపై దాడులను నిరోధించేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన పరిపాలనా యంత్రాంగం గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు వైట్ హౌస్ శుక్రవారం ప్రకటించింది. శ్వేత సౌధంలోని జాతీయ భద్రతా మండలిలో వ్యూహాత్మక కమ్యూనికేషన్ల విభాగం సమన్వయకర్త జాన్ కిర్బీ విలేకర్లతో మాట్లాడుతూ ఈ వివరాలను తెలిపారు. భారతీయ విద్యార్థులపై ఇటీవల జరిగిన దాడుల గురించి విలేకర్లు ప్రశ్నించినపుడు కిర్బీ స్పందిస్తూ, జాతి, స్త్రీ, పురుష, మత, ఇతర అంశాల ఆధారంగా జరిగే హింసను క్షమించేది లేదన్నారు. అమెరికాలో అటువంటి హింస ఆమోదయోగ్యం కాదన్నారు. ఇటువంటి దాడులను నిలువరించేందుకు రాష్ట్రాలు, స్థానిక అధికారులతో కలిసి జో బైడెన్ ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్నారై పెండ్లిళ్లను రిజిస్టర్ చేయాలి

మోసాల కట్టడికి సమగ్ర చట్టం తేవాలి: లా కమిషన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ప్రవాస భారతీయులు (ఎన్నారైలు), ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ), భారత పౌరుల మధ్య వివాహాల్లో మోసాలు పెరుగుతుండటంపై లా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. వీటి కట్టడికి సమగ్ర చట్టం తేవాల్సిన అవసరమున్నదని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఎన్నారై, ఓసీఐ, భారత పౌరుల మధ్య వివాహాలను తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని సూచించింది. ఈ మేరకు ఓ నివేదికను న్యాయ మంత్రిత్వ శాఖకు ప్యానెల్ చైర్మన్ జస్టిస్(రిటైర్డ్) రితు రాజ్ అవస్థీ అందచేశారు. ఎన్నారై వివాహాల్లో జరుగుతున్న మోసాల్లో ముఖ్యంగా భారతీయ మహిళలే అత్యధికంగా బాధితులని నివేదిక పేర్కొన్నది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు కమిషన్ గురువారం రాసిన కవరింగ్ లెటర్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఇటువంటి చట్టాన్ని కేవలం ఎన్నారైలకే కాకుండా పౌరసత్వ చట్టం, 1955లో పేర్కొన్న ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా (ఓసీఐ)లకు కూడా వర్తింప చేయాలని ప్యానెల్ సూచించింది.

కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలు స్తంభన

పునరుద్ధరించిన అప్పిలేట్ ట్రిబ్యునల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బ్యాంక్ ఖాతాలు ఒక్కసారిగా స్తంభించిపోయాయి. పలు రకాల పనుల నిమిత్తం పార్టీ ఇచ్చిన చెక్‌లు పనిచేయలేదు. దీంతో పార్టీ కోశాధికారి అజయ్‌మాకెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ శాఖ ఉద్దేశపూర్వకంగానే ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇలా జరగటంతో కాంగ్రెస్ పార్టీ షాక్ తిన్నది. అయితే 210 కోట్ల పన్ను రాబట్టుకునే అంశంలో భాగంగా ఐటీ శాఖ కాంగ్రెస్ ఖాతాలను ఫ్రీజ్ చేసినట్టు తెలిసింది. ఈ అంశంపై పార్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసింది. ఖాతాలను పునరుద్ధరించిన ట్రిబ్యునల్.. ఈ అంశంపై వచ్చే వారం విచారిస్తామని వెల్లడించింది. ఐటీ శాఖ చర్యను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ సహా పలువురు సీనియర్ నేతలు తప్పుపట్టారు. ఇది ప్రజాస్వామ్యంపై ప్రభుత్వం చేసిన దాడిగా అభివర్ణించారు.

రైతు ఉద్యమం ఉధృతం

గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతం

ఉత్తరాదిలో ప్రభావం • పంజాబ్, హర్యానాలో స్తంభించిన జనజీవనం

హర్యానాలో అన్నదాతలపై మళ్లీ భాష్పవాయు ప్రయోగం

శుక్రవారం హర్యానా-పంజాబ్ సమీపంలోని శంబూ సరిహద్దు వద్ద రైతుల నిరసన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రైతులు తమ డిమాండ్ల సాధన కోసం శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. రైతులు రోడ్లపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకొన్నారు. మార్కెట్లు, వ్యాపార కేంద్రాలు, షాపులను యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్, తరన్ తరన్, బఠిండా, జలంధర్ తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారులను రైతులు స్తంభింపజేశారు. హర్యానాలోని హిస్సార్‌లో రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ఉద్యోగులు రైతులకు మద్దతుగా విధులను బహిష్కరించారు. భారతీయ కిసాన్ యూనియన్ (చరుని) వర్గం రాష్ట్రంలోని పలు టోల్ ప్లాజాల వద్ద ధర్నాలు నిర్వహించింది. శంభు సరిహద్దుల్లో ధర్నా నిర్వహిస్తున్న రైతులపై పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. ముజఫరాబాద్ వద్ద ఢిల్లీ-డెహ్రాడూన్ క్రాసింగ్‌లో బీకేయూ నేత రాకేశ్ టికాయిత్ స్వయంగా ధర్నాలో పాల్గొన్నారు. బిజ్నోర్‌లో బీకేయూ సభ్యులు చెరకు తూకాలను అడ్డుకొన్నారు. భారత్‌బంద్‌లో బీకేయూ (రాజేవాల్), బీకేయూ (దకుండా), బీకేయూ (లఖోవాల్), బీకేయూ (ఖాదియన్), కీర్తి కిసాన్ యూనియన్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. ధర్నాలో పాల్గొన్న ఒక రైతు గుండె పోటుతో చనిపోయాడు. దక్షిణాది రాష్ట్రాల్లో భారత్ బంద్ పెద్దగా ప్రభావం కనిపించలేదు. రవాణా వ్యవస్థకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవలేదు.

ఆందోళన ఉధృతం చేస్తాం: ఎస్కేఎం

రాబోయే రోజుల్లో ఆందోళనను ఉధృతం చేస్తామని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) శుక్రవారం ప్రకటించింది. చర్చల పేరుతో కేంద్రం రైతులను మభ్య పెడుతున్నదని ఆరోపించింది. హామీల అమలును జాప్యం చేస్తూ చర్చల వాతావరణాన్ని పాడు చేస్తున్నదని విమర్శించింది.

రైతుల గొంతులు అణిచే యత్నం

చలో ఢిల్లీ నిరసన చేపట్టిన రైతుల గొంతులను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని రైతు నాయకుడు శర్వణ్ సింగ్ పంధర్ శుక్రవారం ఆరోపించారు. సుమారు 70 మంది రైతులు, యూట్యూబర్ల సోషల్ మీడియా ఖాతాలను సస్పెండ్ చేయడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మరోవైపు కేంద్ర మంత్రులు, నాయకుల మధ్య నాలుగు దఫాలుగా చర్చలు అసంపూర్తిగా ముగియడంతో ఈ నెల 18న మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. ఈ నెల 15న జరిగిన సమావేశంలో తమ సోషల్ మీడియా ఖాతాలను స్తంభింపచేసిన విషయం మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పారా మిలటరీ దళాలు ప్రయోగించిన టియర్ గ్యాస్, షెల్స్ కారణంగా 70 మంది రైతులు గాయపడ్డారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అయోధ్య బాలక్ రామ్‌కు రోజూ గంట విశ్రాంతి

- **మధ్యాహ్నం 12.30 - 1.30 వరకు ఆలయం మూత**
- **ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ వెల్లడి**

అయోధ్య: అయోధ్యలో కొలువైన బాలక్ రామ్‌కు రోజూ మధ్యాహ్నం ఓ గంట సేపు విశ్రాంతి ఇవ్వనున్నట్లు ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ చెప్పారు. ఈ సమయంలో దేవాలయాన్ని మూసివేయనున్నట్లు తెలిపారు. బాల రాముని వయసు ఐదేళ్లు అని, ఆయన ఎక్కువసేపు మేలుకుని ఉంటూ, ఒత్తిడిని భరించలేడని చెప్పారు. ఆయనకు విశ్రాంతి ఇవ్వడం కోసం శుక్రవారం నుంచి రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు విశ్రాంతి ఇవ్వాలని దేవాలయం ట్రస్ట్ నిర్ణయించిందన్నారు. బాలక్ రామ్ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు ముందు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 6 గంటల వరకు దర్శనానికి అనుమతించేవారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన తర్వాతి రోజు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుండటంతో దర్శనం వేళలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పొడిగించారు. బాలక్‌రామ్‌కు తెల్లవారు జామున 4 గంటల నుంచి రెండు గంటల సేపు హారతి, అర్చన నిర్వహిస్తున్నారు.

పరీక్షల వాయిదా లేదు

నకిలీ వార్తలను ఖండించిన సీబీఈఎస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ధర్నా సందర్భంగా 10, 12వ తరగతి వార్షిక పరీక్షలు వాయిదా పడ్డాయన్న వార్తలు నకిలీవని సీబీఎస్‌ఈ శుక్రవారం స్పష్టం చేసింది. వదంతులను నమ్మొద్దని విద్యార్థులకు సూచించింది. రైతుల ధర్నా సందర్భంగా ఢిల్లీలో పరీక్షరాసే విద్యార్థులకు ట్రాఫిక్ మార్గదర్శకాలు మాత్రమే జారీ చేశామని వెల్లడించింది. పరీక్ష కేంద్రాలకు చేరుకోడానికి మెట్రో రైళ్లను ఉపయోగించుకోవాలని సూచించింది. ఇళ్లలో త్వరగా బయలుదేరాలని.. దీని వల్ల రోడ్లు బ్లాక్ అయినా సరైన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చని చెప్పింది. సీబీఎస్‌ఈకి సంబంధించిన ఎలాంటి అధికారిక సమాచారం కోసమైనా తమ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని విద్యా సంస్థలకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు సూచించింది. ఈ నెల 14న 10, 12వ తరగతుల వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి.

తులసి గబ్బర్డ్‌తో ట్రంప్ మంతనాలు!

ఉపాధ్యక్ష అభ్యర్థిత్వంపై చర్చ

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి దేశాధ్యక్ష పదవిని చేజిక్కించుకునేందుకు గట్టిగా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగానే ఆయన, ఆయన బృందం మాజీ యూఎస్ కాంగ్రెస్‌వుమన్, హిందూ-అమెరికన్ నేత తులసి గబ్బర్డ్‌తో చర్చలు జరిపారు. మీడియా కథనాల ప్రకారం, విదేశాంగ విధానం, రక్షణ రంగం వంటి వాటిలో సలహాలు ఇవ్వాలని ఆమెను ఆయన కోరారు. అమెరికా ఉపాధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిగా ఆమె పోటీ చేసే అవకాశాల గురించి కూడా వీరు చర్చించారు. తులసి (42) నాలుగుసార్లు కాంగ్రెస్‌వుమన్‌గా పని చేశారు. 2020లో దేశాధ్యక్ష పదవికి పోటీ చేసి, ఓడిపోయారు. అనంతరం 2022లో ఆమె డెమొక్రాటిక్ పార్టీ నుంచి వైదొలగారు. ఆ తర్వాత ఆమె ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీకి దగ్గరవడం ప్రారంభించారు.

చేయని నేరానికి 37 ఏండ్ల జైలు బాధితుడికి 116 కోట్ల పరిహారం

అమెరికాలోని ఓ కోర్టు తీర్పు

వాషింగ్టన్, ఫిబ్రవరి 16 : చేయని నేరానికి ఏకంగా 37 ఏండ్లు జైలు శిక్ష అనుభవించిన బాధితుడికి పరిహారంగా రూ.116 కోట్లు చెల్లించాలని అమెరికాలోని ఓ కోర్టు ఆదేశించింది. లైంగికదాడి, హత్య ఆరోపణలపై ఫ్లోరిడాకు చెందిన రాబర్ట్ డుబోయిస్‌ను 1982లో పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటికి అతని వయసు 18 ఏండ్లు. మొదట అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అనంతరం దాన్ని యావజ్జీవ శిక్షగా మార్చింది. ఇన్నోసెంట్ ప్రాజెక్ట్ ఆర్గనైషన్ సహకారంతో 2018లో అతడు అప్పీల్ చేయడంతో కేసును తిరిగి విచారణ చేయడానికి ప్రాసిక్యూషన్ అంగీకరించింది. అనంతరం అతడు నిర్దోషిగా తేలాడు. దీంతో అతడు తన కేసు దర్యాప్తు చేపట్టిన తంపా సిటీ పోలీసులపై దావా వేశాడు. బాధితుడికి 116 కోట్లు పరిహారం చెల్లించాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

గాజా సరిహద్దుల్లో ఈజిప్టు గోడ

కైరో: రఫా పట్టణంపై దాడులకు ఇజ్రాయెల్ దళాలు సన్నాహాలు చేస్తుండటంతో ఈజిప్ట్ అప్రమత్తమైంది. దక్షిణ గాజా సరిహద్దుల్లో భారీ గోడను నిర్మిస్తున్నది. శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైంది. గాజాలోని సగం జనాభా ప్రస్తుతం రఫాలోనే తలదాచుకుంటున్నది. గోడ నిర్మాణం గురించి బహిరంగంగా ప్రకటించని ఈజిప్ట్.. పాలస్తీనియన్లను బలవంతంగా తమ భూభాగంలోకి నెట్టొద్దని ఇజ్రాయెల్‌ను కోర